క్లుప్తంగా

పత్రికా స్వేచ్ఛపై దాడి తగదు

టెక్కలి: పత్రికా స్వేచ్ఛపై కూటమి ప్రభుత్వం దాడి చేయడం తగదని వైఎస్సార్‌సీపీకి యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.గురునాథ్ యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సాక్షి పత్రిక, ఛానెల్‌పై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు పాల్పడుతోందని మండిపడ్డారు. సాక్షి ఎడిటర్‌పై కేసులు నమోదు చేయడం అప్రజాస్వామ్యకమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సామాన్య ప్రజలపై దాడులకు తెగబడుతున్నారని, ఇప్పుడు పత్రికా స్వేచ్ఛపై దాడి చేస్తున్నారని ధ్వజమెత్తారు.

కృష్ణమూర్తికి సత్కారం


సత్కారం పొందుతున్న డాక్టర్ కృష్ణమూర్తి

కాశీబుగ్గ: ఈనెల 19, 20 తేదీల్లో 30 గంటలపాటు నిర్విరామంగా పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలోని బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో శ్రీశ్రీ కళావేదిక 140వ కార్యక్రమం జరిగింది. ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతర పేరుతో జరిగిన శతాధిక కవి సమ్మేళనం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలాసకు చెందిన ప్రముఖ రచయిత, నటుడు లయన్ డా.తెప్పల కృష్ణమూర్తి కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. తరగని ఆస్తులు మన సాంప్రదాయాలు అనే అంశంపై కవితా గానము చేసి ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణ్, జాతీయ ప్రధాన కార్యదర్శి డాటి.పార్థసారధి, రమావతి తదితరులు కృష్ణమూర్తికి జ్ఞాపిక అందించి సత్కరించారు.

ఆకట్టుకున్న దుర్దశ నాటిక


దుర్దశ నాటికలో రసవత్తర సన్నివేశం

కాశీబుగ్గ: తాడేపల్లిగూడెంలో శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ కళా జాతర నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా డాక్టర్ తిరుపతి సాహూ రచనా, దర్శకత్వంలో ప్రదర్శించిన దుర్దశ అనే నాటిక ఆకట్టుకుందని పలాసకు చెందిన సినీ నటుడు డాక్టర్ కుమార్‌కు నాయక్ అన్నారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ దుర్దశ నాటికను పాత్రలవారిగా వివరించి అభినందించారన్నారు. ఈ నాటికలో డాక్టర్ కుమార్ నాయక్, భంజదేవ్ సమంతా, కురగొడ, రోషన్ సుభాష్ షాహో, చందమామ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అవతార దినోత్సవం


రామకృష్ణాపురంలో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: భగవాన్ శ్రీసత్యసాయి బాబా అవతార ప్రకటన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో కాశీబుగ్గ, పలాస సత్యసాయి మందిర కమిటీలతో పాటు, రామకృష్ణాపురం శ్రీసత్యసాయి విద్యా విహార్‌లో సామూహికంగా ఓంకార సుప్రభాత, నగర సంకీర్తనలు జరిగాయి. అనంతరం తాండూశార్చన భక్తిశ్రద్ధలతో జరిపించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తాళాసు శ్రీను, సెక్రటరీ మల్లా శరత్, ప్రిన్సిపాల్ ప్రీతీ చౌదరి, ఉపాధ్యాయులు అనుదీప్, సూర్య, లావణ్యకృష్ణ, దాలేటి, ఉమా, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం తనిఖీ


వసతి గృహం పరిశీలిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: మందస మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాన్ని 6వ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కె.కిషోర్ బాబు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహంలో బాలికలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీసి, హెచ్‌డబ్ల్యూ ఓడీ కృష్ణవేణికు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూ పరిశీలించారు. మరుగుదొడ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సిబ్బంది పనితీరు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆయనతో పాటు మందస ఎస్‌ఐ ఖాదర్‌బాషా ఉన్నారు.

మాధురికి నోటీసులు

టెక్కలి: పట్టణానికి చెందిన దివ్వల మాధురికి తిరుపతి పోలీసులు ఆదివారం నోటీసులు అందజేశారు. ఇటీవల తిరుపతి మాడవీధుల్లో ఫొటో షూట్ చేశారనే అభియోగంపై ఆమెకు నోటీసులు అందజేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు.

గోతులు పూడ్చరూ..!



టెక్కలి నుంచి నౌపడకు వెళ్లే మార్గంలో నౌపడ రైల్వే గేటు వద్ద ఏర్పడిన గొయ్యితో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. సరిగ్గా గేటుకు సమీపంలో గొయ్యి ఏర్పడడంతో కొన్ని సందర్భాల్లో వాహనాలు దిగబడి అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి గేటుకు సమీపంలో ఏర్పడిన గొయ్యిను పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు. – టెక్కలి

ఆకట్టుకున్న వేషధారణలు



చిత్రంలో కనిపిస్తున్నవారంతా పెళ్లి చేసుకుని వస్తున్న బృందం మాదిరిగా ఉన్నారు కదా. వీరంతా మందస మండలం బహాడపల్లి గ్రామంలోని నందెన్న సంబరాల్లో వేషధారులు. ఆదివారం ఉదయం మేళతాళాలతో అంగరంగ వైభవంగా పెళ్లి వేషం వేయబడింది. వృద్ధ దంపతులు, బాల్య వివాహం, మధ్య వయస్సు దంపతుల వేషదారులు అందరినీ ఆకట్టుకున్నారు. – కాశీబుగ్గ

ఏదీ చిత్త శుద్ధి..?



వజ్రపుకొత్తూరు మండలంలోని ప్రధాన వ్యాపార కేంద్రం పూండిలో ఎటుచూసినా అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. రైల్వే అండర్ పాసేజ్ నుంచి అమలపాడు జంక్షన్ వరకు ఇదే పరిస్థితి. అలాగే వైఎస్సార్ జంక్షన్ వద్ద చెత్త డంపింగ్ యార్డును తలపిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే మూడు రోడ్ల కూడలి సైతం మురికి కూపాన్ని తలపిస్తోంది. దీంతో ఇదేనా చిత్త శుద్ధి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. – వజ్రపుకొత్తూరు

పిచ్చి మొక్కలకు నిలయం



కంచిలి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో ఉన్నటువంటి కంచిలి–2 సచివాలయ పరిసరాలు పిచ్చిమొక్కలతో నిండాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో విష కీటకాలు కార్యాలయంలోనికి ప్రవేశించే అవకాశం ఉంది. దీంతో ఈ పిచ్చి మొక్కలు తొలగించేవిధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – కంచిలి

డేంజర్ జోన్..!

- ప్రమాదకరంగా జాతీయ రహదారి
- బొప్పాయిపురం నుంచి జగతిమెట్ట జంక్షన్ వరకు తరచూ ప్రమాదాలు
- నియంత్రణ చర్యలు చేపట్టడం లేదంటూ విమర్శలు


బొప్పాయిపురం నుంచి అక్కవరం మార్గం

టెక్కలి: ఇటీవల జాతీయ రహదారిలో విక్రంపురం సమీపంలో రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. కొద్దిరోజుల క్రితం ఇదే విక్రంపురం సమీపంలో రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని మరో వ్యక్తి మృతి చెందాడు. బొప్పాయిపురం సమీపంలో ఒక మహిళ రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని మృతి చెందింది. జగతిమెట్ట సమీపంలో కారు ఢీకొని మరొకరు మృతి చెందారు. విక్రంపురం సమీపంలో ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనంతో ఢీకొని ఇద్దరు మృతి చెందారు. ఈ ప్రమాదాలన్నీ టెక్కలి మండలం పరిధిలో జాతీయ రహదారి బొప్పాయిపురం నుంచి జగతిమెట్ట జంక్షన్ వరకు జరిగిన రోడ్డు ప్రమాదాలు. తరచూ ఇక్కడ రోడ్డు ప్రమాదాలు సంభవించి మృత్యువాత పడుతుండడంతో ఈ ప్రాంతం డేంజర్ జోన్‌గా మారింది. ఈ ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తూ పలువురు మృత్యువాత పడుతున్న విషయం తెలిసినవారు ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి భయాందోళన చెందుతున్నారు. అయితే గత కొద్ది రోజులుగా ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం నియంత్రణ చర్యలు చేపట్టడం లేదంటూ స్థానికులు విమర్శలు చేస్తున్నారు.

కానరాని నియంత్రణ చర్యలు


పక్కన పడేసిన వేగ నియంత్రణ డ్రమ్ములు

జాతీయ రహదారిలో బొప్పాయిపురం వద్ద గతంలో రోడ్డుకు ఒక వైపు డ్రమ్ములను ఏర్పాటు చేసి ప్రమాదాల నియంత్రణ చర్యలు ఉండేవి. అంతేకాకుండా వంతెన వద్ద హెచ్చరిక బోర్డుల సైతం ఏర్పాటు ఉండేవి. ప్రస్తుతం అవి ఒక పక్కకు చేరుకున్నాయి. దీంతో మితిమీరిన వేగంతో వచ్చే వాహనాల స్పీడ్‌కు కళ్లెం లేకుండా పోయింది. వీటితో పాటు నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు పైనే పెద్ద పెద్ద లారీలు పార్కింగ్ చేస్తున్నప్పటికీ హైవే పెట్రోలింగ్ సిబ్బంది చూసి చూడనట్లుగా వ్యవహరించడంలో ఆంతర్యమేమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి డేంజర్ జోన్‌గా ఉన్న మార్గంలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు చేపట్టాలి



బొప్పాయిపురం నుంచి అక్కవరం జంక్షన్ వరకు తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవించి జనాలు చనిపోతున్నారు. వీటితో పాటు చిన్నపాటి ద్విచక్ర వాహనాల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటువంటి ప్రమాదాలు లేకుండా నియంత్రణ చర్యలు చేపడితే మంచిది.

– జి.మోహన్‌రెడ్డి, సర్పంచ్, బొప్పాయిపురం, టెక్కలి మండలం

ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం



రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. బొప్పాయిపురం నుంచి విక్రంపురం జంక్షన్ వరకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నాం. ప్రతీరోజూ హైవే పెట్రోలింగ్ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. వీటితో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– ఎ.విజయ్‌కుమార్, సీఐ, టెక్కలి

ఎన్నికల హామీలు నెరవేరుస్తున్నాం


పలాస: లొద్దభద్రలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

పలాస: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లొద్దభద్రలో రూ.32 లక్షలతో, రాజగోపాలపురంలో రూ.17 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. పలాస నియోజకవర్గంలో అనేక సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సమస్యలపై వివరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వంకల జయలక్ష్మి, నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు, వంకల షణ్ముఖరావు, కుత్తుం లక్ష్మణ్‌రావు, తమ్మినేని గంగారం, జయరాం తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: మందసలో ఆదివారం నిర్వహించిన పల్లె పండుగ పంచాయతీ వారోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొన్నారు. దీనిలో భాగంగా మందస గ్రామంలో రూ.66.40 లక్షలతో ఏడు రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మందస మండల అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న తిలక్

నందిగాం: మండలంలోని కాపు తెంబూరు జంక్షన్ వద్ద జాతీయ రహదారి మీద ఆదివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పలాస మండలం గోపాలపురానికి చెందిన చాప కేశవరావు, చాప కామయ్యలు స్కూటీ మీద నందిగాం మండలం బోరుభద్ర పంచాయతీ కామధేనువులో జరిగిన ఒక ఫంక్షన్‌కు వచ్చారు. అనంతరం తిరిగి గోపాలపురం వెళ్లేందుకు కాపు తెంబూరు జంక్షన్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా ఒడిశా నుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో స్కూటీ మీద నుంచి ఎగిరిపడి ఇద్దరూ గాయాలపాలయ్యారు. వెంటనే స్థానికులు టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. గాయపడినవారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్‌ఐ షేక్ మహ్మద్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆస్పత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు. అలాగే వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందజేయాలని కోరారు. పరామర్శించినవారిలో నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, చిన్న జోగారావు యాదవ్ తదితరులు ఉన్నారు.

'పల్లె పండగ'తో గ్రామ స్వరాజ్యం

- ఎమ్మెల్యే బెందాళం అశోక్


సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం రూరల్: పల్లె పండగ కార్యక్రమంతో గ్రామ స్వరాజ్యం సాధ్యమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. పల్లె పండగ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని కేదారిపురం, బాలకృష్ణాపురం పంచాయతీల్లో ఆదివారం జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీసీ రోడ్ల పనులకు భూమి పూజ చేశారు. ప్రజలు తమపై పెంచుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పల్లె ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు.

ఆధిపత్య పోరు

ముచ్చింద్రలో ఆదివారం నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమానికి ఎమ్మెల్యే బెందాళం అశోక్ హాజరు కావాల్సి ఉంది. అయితే ఈ సందర్భంగా టీడీపీ, జనసేన కార్యకర్తలు గ్రామంలో వేర్వేరు చోట్ల కార్యక్రమానికి సంబంధించి శిబిరాలు ఏర్పాటు చేయడంపై ఎమ్మెల్యే అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ మాజీ సర్పంచ్ సాడి ఢిల్లీరావు, టీడీపీ నాయకుడు చినపాన సారధిరెడ్డిలు స్థానిక రత్నేశ్వర ఆలయం వద్ద సమావేశం ఏర్పాటు చేయగా, జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డి, గతంలో జనసేన తరుపున సర్పంచ్‌గా పోటీ చేసిన తిప్పన చంద్రశేఖరరెడ్డిలు ముచ్చింద్ర గ్రామ మండపం వద్ద సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త దాసరి రాజులు ఇరువర్గాలకు నచ్చజెప్పినప్పటికీ, తమ సమావేశానికి హాజరు కావాలంటూ ఇరువైపులా పట్టుబట్టడంతో చేసేదేమీలేక పల్లె పండగ కార్యక్రమానికి హాజరవ్వకుండానే ఎమ్మెల్యే వెనుదిరిగారు. దీంతో కూటమి ప్రభుత్వం పాలన ఇంకా ఏడాది కాకుండానే మండలంలో టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య ఆధిపత్య పోరు బట్టబయలైందని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

పరామర్శ


పరామర్శలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గం పరిధిలో ఆదివారం పలు పరామర్శల్లో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పాల్గొన్నారు. మందస మండలం బహాడపల్లి గ్రామస్తురాలు సార లక్ష్మమ్మ, బిడిమి గ్రామస్తురాలు జుత్తు పాపమ్మ, రాంపురం గ్రామస్తుడు కిల్లు రమేష్, గుడ్డిభద్ర గ్రామస్తుడు దున్న చిన్నారావు ఇటీవల మరణించిన కారణంగా ఆయా కుటుంబాలకు పరామర్శించి, వారికి ధైర్యం చెప్పి తన ప్రగాఢ సంతాపం తెలిపారు.

అక్కుపల్లిలో కృష్ణ మోహన్ పర్యటన

వజ్రపుకొత్తూరు రూరల్: మత్స్యకార గురుకుల పాఠశాల అక్కుపల్లిలో ఆదివారం గురుకుల పాఠశాల సొసైటీ రాష్ట్ర కార్యదర్శి ఎ.కృష్ణమోహన్ ఆకస్మిక పర్యటన చేశారు. ఈ సందర్భంగా పాఠశాలను పరిశీలించి వసతుల విషయం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కొత్త భవనాలకు బెండి గేట్ వద్ద స్థలం ఉందని, అయితే నిర్మాణానికి నిధులు లేకపోవడంతో అలస్యమవుతున్నట్లు పేర్కొన్నారు. ఆయనతో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ జి.ప్రశాంతి, సిబ్బంది ఉన్నారు.

వరల్డ్ రికార్డులో చోటు


అమ్మోజీని సన్మానిస్తున్న శ్రీశ్రీ కళా వేదిక నిర్వాహకులు

టెక్కలి: టెక్కలి మండలం పోలవరం గ్రామానికి చెందిన వర్ధమాన రచయిత్రి బమ్మిడి అమ్మోజీకి నాలుగు వరల్డ్ రికార్డుల్లో చోటు దక్కింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. తాడేపల్లిగూడేంలో శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ తెలుగు కళా జాతరలో భాగంగా ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డు, కల్చరల్ టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో అమ్మోజీ పేరు నమోదైనట్లు నిర్వాహకులు కట్టిమండ ప్రతాప్, కన్వీనర్ కొల్లి రమావతి వెల్లడించారు. అమ్మో కలం పేరుతో రచనలు చేయడంతో పాటు సామాజిక సేవలో తనదైన పాత్ర పోషిస్తున్నందుకు ఈ అవకాశం లభించినట్లు ఆమె తెలిపారు.

ఆపన్న హస్తాలు


మదన్‌కి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

కవిటి: మండలంలోని మత్స్యకార గ్రామం బట్టివానిపాలెంకు చెందిన పేద మత్స్యకార బాలుడు చీకటి మదన్ రక్తహీనత సమస్యతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న దాతలు ఉదారంగా సాయమందించేందుకు ముందుకు వస్తున్నారు. తాజాగా చీకటి మదన్ తండ్రి హేమరాజుతో కలిసి చదువుకున్న జగతి ఉన్నత పాఠశాల 2014 టెన్త్ బ్యాచ్ విద్యార్థి బృందం రూ.10100లు, చిన్న కర్రివానిపాలెం గ్రామానికి చెందిన భగత్‌సింగ్ సంఘం సభ్యులు రూ.13100లు, కవిటి ఉద్దానంకు చెందిన చింతామణి సీ ఫుడ్స్ సంఘం సభ్యులు రూ.10,000 వంతున ఆర్థిక సాయంతో ఆపన్న హస్తం అందించారు. ఈ మేరకు ఆదివారం బాధిత కుటుంబాన్ని కలిసి బాలుడికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులు సాయమందించిన దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత


సంతబొమ్మాళి: ఆర్థిక సాయం అందజేస్తున్న కేపీ ఫౌండేషన్ సభ్యులు

సోంపేట: మండలంలోని మాకన్నపురం గ్రామానికి చెందిన టెంక కోటేష్ (18) అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడు. కోటేష్ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో గ్రామానికి చెందిన స్టూడెంట్స్ ఫోర్స్ సభ్యులు, గ్రామస్తులు రూ.55 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో యువత పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండలంలోని బడే నర్సాపురం గ్రామానికి చెందిన పొన్నాడ శ్రీను మృతి చెందడంతో ఆ కుటుంబానికి కేపీ స్పందన ఫౌండేషన్ సభ్యులు ఆదివారం ఆర్థిక సహాయం అందించారు. రూ.18.116లు నగదును అందజేశారు. స్థానిక సర్పంచ్ దుక్క భూషన్ రెడ్డి తనవంతు సాయంగా రూ.10 వేలు, మిగిలిన సభ్యులు రూ.8.116లు సమకూర్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సర్పంచ్ దుక్క భూషణ్‌రెడ్డి, షణ్ముఖ మాస్టర్, శివారెడ్డి, భాను రెడ్డి, సుందర్, రమణరెడ్డి, చందు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వ్యవసాయ సదస్సు


రైతు సదస్సుకు హాజరైన రైతులు

కాశీబుగ్గ: మందస మండలం హరిపురం–బాలిగాం కూడలిలో ఉన్నటువంటి ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వ్యవసాయ సదస్సు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలాస నియోజకవర్గ రైతాంగ సమస్యల సాధన కమిటీ అధ్యక్షుడు మామిడి మాధవరావు ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై కూలంకషంగా అభిప్రాయాలను వ్యక్తపరిచారు. కార్యక్రమంలో వివిధ రైతు అనుబంధ సంఘ నాయకులు ముడిమించి మాధవరావు, గొర్లె చలపతిరావు, దాసరి శ్రీరాములు, మద్ది బాబూరావు, తామాడ త్రిలోచన, సింహాద్రి, పేడాడ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నందెన్న గౌరమ్మ ఉత్సవాలు


వజ్రపుకొత్తూరు రూరల్: బైపల్లిలో పగటి వేషధారణల్లో అలరిస్తున్న కళాకారులు


కవిటి: కొజ్జీరియాలో నందెన్నకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సోంపేట: మండలంలోని జింకిభద్ర గ్రామంలో ఆదివారం ఘనంగా గౌరమ్మ, నందెన్న ఉత్సవాన్ని నిర్వహించారు. మేళతాళాలతో నందెన్న, గౌరమ్మ తిరువీధి చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని వివిధ గ్రామాల్లో గౌరమ్మ, నందెన్న సంబరాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గౌరీ పౌర్ణమి నుంచి పాడి పంటలను దేవతగా భావించి గౌరమ్మ, నందెన్నల్ని గ్రామాల్లో పూజలు చేయడం సాంప్రదాయంగా వస్తోంది. పాడి పంటలతో పల్లెలు కళకళలాడాలని కాంక్షిస్తూ ఈ పండుగలో అన్నివర్గాల ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొంటున్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బైపల్లి, రాజాం, బాతుపురం గ్రామాల్లో ఆదివారం ఘనంగా గౌరమ్మ ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా యువకులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


సోంపేట: జింకిభద్ర గ్రామంలో నందెన్న, గౌరమ్మ ఉత్సవం


సోంపేట: ఆకట్టుకున్న పగటి వేషధారణలు

రోడ్డు పనులకు శంకుస్థాపన

నందిగాం: మండల కేంద్రమైన నందిగాంలో పల్లె పండుగలో భాగంగా సిమ్మెంట్ రోడ్డు పనులకు టీడీపీ నాయకులు ఆదివారం శంకుస్థాపన చేశారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా రూ.10 లక్షలతో స్థానిక ఎలిమెంటరీ స్కూల్ నుంచి వెటర్నరీ ఆస్పత్రి వరకు వేసే రోడ్డు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కొన్ని ప్రసాదరావు పాల్గొన్నారు.